# ఓ బ్రహ్మచారి

## - తిమిరిశ జానకి

గదికి తాళం వేసి దివాకర్ వెనక్కి తిరిగేసరికి ఎదురింటి వరండాలో ఎప్పటిలా దర్శనమిచ్చారు రంగారావు గారు. రోజూలాగే ఆయన ముఖంలో పలకరింపుగా చిన్న చిరునవ్వు. నల్లగా, లావుగా ఉంటారు. బడిపంతులుగా ఈ మధ్యనే రిటైర్ అయ్యారు.

ఆయనంటే అదో రకం ఎలర్జీ దివాకర్‌కి.

కొత్తగా ఈ వీధిలో తెల్ల డాబా ఇంట్లో ఓ గది అద్దెకి తీసుకున్నాడు దివాకర్.

నిజం చెప్పాలంటే అతను ఉద్యోగంలో చేరిందీ కొత్తే. ఆ డాబా ఇంట్లో ఓ గదిలో ఇతనుంటే, పక్కనున్న మూడు గదుల పోర్షన్లో ఓ దంపతులున్నారు.

ఇక ఎదురిల్లు రంగారావుది.

ఎలాగైనా సరే తనతో పరిచయం పెంచుకోవాలని ఆయన పడే తాపత్రయం వినుగు పుట్టిస్తూ ఉంటుంది దివాకర్‌కి. 'లేకపోతే ఏమిటి' అనుకుంటూ ఉంటాడు రోజుకి ఓసారయినా.

ఆయన గారి కో కూతురుంది. పెళ్ళి కావలసిన పిల్ల. తనేమో బ్రహ్మచారి. చిన్న వయసువాడు. ఉద్యోగస్తుడు. అది చూసేగా తనని ఎలాగైనా సరే బుట్టలో వేసుకుని కూతురి పెళ్ళి చేసెయ్యాలని చూస్తున్నాడు! అందుకే ఈ ఆలోచనతోనే పరమ వినుగు ఆయనంటే.

ఎక్కడ లేని చిన్న చూపు ఆయన మీద.

ఒక రోజు కాఫీ, టిఫినుకి పిలిచాడు వాళ్ళింటికి. ఏదో చెప్పి తప్పించుకున్నాడు. వెళ్ళలేదు.

మరొక రోజు ...

ఆ రోజు...

తలుపు మీద చిన్నగా వేళ్ళతో కొట్టిన శబ్దమై తీశాడు తలుపు.

ఎదురుగా చిరునవ్వుతో ఈ మహానుభావుడు.

'చచ్చాం' అనుకున్నాడు మనసులో.

"ఏం కావాలండీ?" అన్నాడు పైకి. లోపలికి రమ్మనలేదు. కూర్చోమనలేదు.

"లోపలికి రావచ్చునా?" అంటూనే ఓ అడుగు గదిలోవేశా డాయన.

'రమ్మనకపోయినా వచ్చేశావుగా?' తిట్టుకున్నాడు లోలోపల.

"రేపు ఆదివారం, పండగా రెండూ కలిసొచ్చాయి... ఒకవేళ ఈ పండక్కి మీకు సెలవు ఇవ్వరని నువ్వు అన్నా ఆదివారం నాడు ఎలాగూ సెలవే కదా! అందుకని రేపు నువ్వు మా ఇంటికి భోజనానికి రావాలి. ఈ మాట చెప్పాలని వచ్చాను." ఎంతో నెమ్మదిగా, మృదువుగా పలికింది రంగారావు కంఠం.

'ఎలాగైనా సరే మీ ఇంట్లో టిఫిన్లకీ, భోజనాలకీ నన్ను ఒప్పించి, కాకా పట్టి, ఇరకాటంలో పెట్టి చివరికి బుట్టలో వేసుకుని కూతుర్ని పెళ్ళి చేసుకోమని అడగాలని పెద్ద ప్లానే వేశావులే ముసలాడా... ఆ మాత్రం అర్థం చేసుకోలేని పసివాడిని కాను. ఓ... సారీ... పసివాడినైతే నీ కూతుర్ని కట్టబెట్టాలని ఎందుకు చూస్తావు?... మందమతిని కాను.. ఈ విషయం తమరు తొందరగా అర్థం చేసుకుని జిడ్డులా నన్ను పట్టుకోవడం మానేస్తే మంచిది. బి. ఏ. పాసయ్యాను. గవర్నమెంటు ఉద్యోగం, అందగాడిని, నాకు నీ అనాకారి కూతుర్ని అంటకట్టేసి గుండెల మీంచి బరువు దింపేసుకుని నిశ్చింతగా నిద్రపోదామనుకుంటున్నావా? నా నిద్ర కరువు చేద్దామనుకుంటున్నావా? నే నంత తేలిగ్గా నీకు లొంగే ఘటాన్ని కాను. అందమైన పిల్లనే చేసుకుంటాను. ముప్ఫయ్ వేలు నా మినిమమ్ రేటు అంతకి ఎక్కువే తప్ప ఒక్క పైసా తగ్గినా అటువంటి సంబంధం వంక కన్నెత్తయినా చూడను.. అఫ్‌కోర్స్... కాలేజీలో చదివే రోజుల్లో కట్నాలెవరూ పుచ్చుకోకూడదనీ, కట్నాలు తీసుకున్న వాళ్ళని శిక్షించాలనీ డిబేట్స్‌లో మాట్లాడి ప్రైజులు కొట్టేసిన మాట నిజమే. అవన్నీ డిబేట్స్ వరకే పరిమితం. ఆచరించి చూపిస్తానని కంకణం కట్టుకోలేదు నేను. మహా మహా నాయకులే వాళ్ళు చేసిన వాగ్దానాలు వాళ్ళు నిలబెట్టుకోలేకపోతున్నారు. ఆఫ్టరాల్ నా బోటివాడో లెక్కా? ను వ్వేమాత్రం తాహతులో ఉన్నావో నేనూహించుకోగలను. పైగా నీ కూతురు అందగత్తె కాదు. అటువంటప్పుడు నాలాంటి బి. ఏ. వాడు కాదు కదా - ఇంటర్మీడియట్ వాడు కూడా అల్లుడుగా దొరకడు నీకు...'

"ఏవిటి, బాబూ, భోజనానికి పిలిస్తే అంత ఆలోచిస్తున్నావు? పంచ భక్ష్య పరమాన్నాలు పెట్టలేకపోయినా ఏదో మా తాహతుకు తగ్గట్టు వంట చేయించి ఆప్యాయతగా తినిపించగలను..."

'ఆహా... ఆహా... దొరికావు కదయ్యా... మెల్లి మెల్లిగా ఇలాగే భోజనాల దగ్గర మా తాహతుకు తగ్గట్టు అంటూ మొదలుపెట్టి ... రేపొద్దున్న... "ఏదో మా తాహతుకి తగ్గట్టు సింపుల్‌గా పెళ్ళి చేస్తాను. కట్నం ఏమీ ఇచ్చుకోలేను. నా కూతుర్ని కట్టుకో బాబూ!" అంటావు... అంతేలే... అర్థమైపోయింది నీ ట్రిక్కు...

"రేపు మా ఫ్రెండు వాళ్ళింట్లో భోజనానికి పిలిచారండీ. వస్తానని చెప్పాను వాడికి... మీ ఇంటికి రాలేను." నోటొకొచ్చిన అబద్ధం ఆడేశాడు.

'మీ ఇంటికి రాలేను' అన్న మాట కొంచెం కటువుగానే వచ్చింది.

అయినా అదేమీ గమనించినట్టు లేదు రంగారావు. ఆయ నటు వెళ్ళగానే "అమ్మయ్య... ఇవ్వాల్టికి వదిలాడు బాబూ" అనుకుంటూ ఓ దండం పెట్టుకున్నాడు దివాకర్.


** ** ** **

వరండాలో కూర్చునున్న రంగారావుకు ఆశ్చర్యంగా ఉంది.

ఎనిమిదిన్నరయింది - తొమ్మిదయింది - తొమ్మిదిన్నర కూడా అవుతోంది... ఇంత వరకూ దివాకర్ వీధి తలుపు తియ్యకపోవడం... ఆఫీసుకి బయల్దేరకపోవడం ఆశ్చర్యమేమరి!

రోజూ ఎనిమిదిన్నరకల్లా ఇంట్లోంచి బయల్దేరిపోతాడు. తిన్నగా ముందు హొటల్‌కి వెళ్ళి కావలసింది తిని అప్పుడు అటునుంచి ఆఫీసుకి వెళ్ళిపోతాడు. అసలు నిద్ర లేవగానే వీధి తలుపు తీసేస్తాడు. అటువంటిది తొమ్మిదిన్నర అవుతున్నా తలుపే తియ్యలేదు. ఇవాళ ఆఫీసుకి సెలవు రోజేం కాదు.

ఒకవేళ... ఒంట్లో బాగులేక అసలు



లేవలేదేమో? అంతే అయి ఉంటుంది.

ఈ ఆలోచనతో ఉలిక్కిపడ్డాడు రంగారావు.

దివాకర్ పక్క పోర్షన్లో ఉండే సత్యానందం భార్య అనసూయ కూ్కాడా తెల్లారి లేచినప్పట్నించీ సందేహంగానే ఉంది. ఇంత పొద్దెక్కినా అతనింకా నిద్ర లేవకపోవడం ఏమిటా అని.

రోజూ ఆరింటికల్లా లేస్తాడు. లేచాక పళ్ళు తోముకోవడం దగ్గర్నించి అన్ని పనులకీ అతను పెరట్లోకి రావల్సిందే. ఇవాళింత వరకూ పెరట్లోకే రాలేదు.

ఉండబట్టలేక భర్తతో అంది ఆ మాట.

సత్యానందం అసలే అనుమానమ్మనిషి. గయ్యిమంటూ లేచాడు ఇంతెత్తున.

"ఏం? అత నెంతసేపు నిద్రపోతే నీకేం? బయటికి రాకపోతే నీకేం? తెల్లారి లేచాక అతగాడి మొహం కనపడకపోతే ఏ పని మీదకీ నీ మనసు పోవట్లేదా?"

ఛ... ఛ... తన భర్త అనుమానప్పక్షి అని తెలిసి కూడా ఆయన గారితో త నీమాట అనడం ఎందుకూ? బుద్ధిగడ్డి తినడం అంటే ఇదే కాబోలు...

పాపం ఒంటరి వాడు... బుద్ధిమంతుడు... అతని వాళ్ళున్న వాళ్ళు ఎక్కడో దూరాభారాన ఉన్నారు... తన తమ్ముడి ఈడు వాడు... ఒంట్లో బాగులేదో ఏమిటో?... కాస్త కనుక్కుంటారేమో తలుపు కొట్టి అన్న ఉద్దేశంతో తను చెప్తే... ఇదీ వరస...

గట్టిగా చెంపలేసుకుని వంటింట్లోకి వెళ్ళిపోయింది.

** ** ** ** **

మరి ఒక్క క్షణం ఆగలేకపోయాడు రంగారావు. గబగబా చెప్పులేసుకుని ఎదురింటికి నడిచాడు... దివాకర్ గది తలుపు మీద చిన్నగా కొట్టాడు.

జవాబు లేదు.

మరోసారి కొట్టాడు... ఏ అలికిడీ లేదు...

మూడోసారి కొట్టాక "ఊ" అంటూ చిన్నగా మూలుగులా వినవడింది.

అప్పుడిక వెయిట్ చేశాడు కాసేపు.

అడుగుల చప్పుడైంది. మెల్లిగా తెరుచుకుంది తలుపు.

తలుపు తీసిన దివాకర్ని చూస్తూనే రంగారావు మొహంలో జాలి కదలాడింది.

ఆయన్ని చూస్తూనే అతని కళ్ళల్లో వినుగు తొంగి చూసింది.

"ఏవిటి బాబూ? ఒంట్లో బాగులేనట్టుందే? ఇంత పొద్దెక్కినా తలుపే తియ్యలేదు... ఇవతలికే రాలేదేమిటా అని... ఉండబట్టలేక చూద్దామని వచ్చాను."

"ఆ... రాత్రి నుంచీ హఠాత్తుగా జ్వరం... బాగా ఎక్కువగా వచ్చేసింది... అసలు లేచే ఓపిక లేదు." మాట పూర్తి చేస్తూనే వెళ్ళి మంచం మీద అడ్డంగా పడ్డాడు.

పాపం అనిపించింది ఆయనకి.

జాలితో మనసు నిండిపోయింది.

గబగబా ఇంటికి వెళ్ళి భార్య చేత కాఫీ కలిపించి తీసుకు వచ్చి తాగించాడు దివాకర్చేత.

అయిష్టంగానే తాగాడు... తప్పనిసరిగా. ఆ అయిష్టం... తాగాలని లేక కాదు... రంగారావు తీసుకొచ్చినందువల్ల కలిగిన అయిష్టం అది. జ్వరం కంటే ఎక్కువగా బాధిస్తున్న విషయం ఇది.

"మీ డాక్టరు ఎవరు బాబూ? చెపితే వెళ్ళి తీసుకు వస్తాను కూడా ఉండి."

"అక్కర్లేదు... మీరు తీసుకురావక్కర్లేదు... నేను వెళ్ళగలను రిక్షాలో." పుల్ల విరిచినట్టే జవాబిచ్చాడు టక్కున.

"సరే అయితే... సాయంగా నేను కూడా వస్తాను హాస్పిటల్కి." ఎంతో మృదువుగా, ఈ మాత్రం సహాయం కూడా చేసుకోకపోతే ఎందుకూ అన్నంత మామూలుగా ఉంది ఆయన మాట.

ఇక రెట్టించే ఓపిక లేక ఊరుకున్నాడు గానీ. లేకపోతే ఆయన్ని తనతో హాస్పిటల్కి రానిచ్చేవాడు కాదు దివాకర్....

** ** ** ** **

ఆ రోజు ఆదివారం. స్నేహితు డొకడిని కలుసుకోవాలని బయటికి బయల్దేరాడు దివాకర్. వీధిలోకి వచ్చేసరికి ఎదురింటి గేటు దగ్గర. ఎవరితోనో మాట్లాడుతూ కనిపించారు రంగారావు.

నవ్వుతూ పలకరించారు దివాకర్ని "రా బాబూ... మా శేఖర్ని పరిచయం చేస్తాను."

ఆ శేఖర్ అన్న వ్యక్తి వైపు పరీక్షగా చూస్తూ తప్పనిసరిగా మొక్కుబడి కోసం అన్నట్టు వాళ్ళవైపు నడిచాడు దివాకర్.

చూడడానికి అందంగా ఉన్నాడు. చదువుకున్న వాడిలానే ఉన్నాడు. మొహంలో నమ్రత, కళ్ళల్లో స్నేహభావం ఉట్టిపడుతున్నాయి. అతను నిలబడి మాట్లాడుతున్న తీరు చూస్తుంటే పెద్దలంటే భక్తిగౌరవాలు ఉన్నట్టే ఉన్నాయి.

ఇదీ శేఖర్ గురించి ఆ కొద్ది క్షణాల్లో దివాకర్కి కలిగిన అభిప్రాయం.

"ఇతను నా మేనల్లుడు కాబోయే అల్లుడు కూడా. మా అమ్మాయినే చేసుకుంటానని ఏనాడో చెప్పేశాడు. ఎమ్. డి. చేస్తున్నాడు. అది పూర్తయ్యే దాకా ఆగాలని ఆగాం. వచ్చే నెల్లో పూర్తయిపోతోంది. ఆ పై నెల్లో ముహూర్తం పెట్టించేస్తాం. పైసా కట్నం పుచ్చుకోనని కూడా ముందే చెప్పేశాడు. మేనరికం కదా అని తప్పనిసరిగా చేసుకోమని పెద్దవాళ్ళం మేము

